# గాడిద గుడ్డు *

డి.వి. నరసరాజు




ఒకానొకప్పుడు —

ఆంధ్రదేశాన్ని ఒక రాజు పాలిస్తుండేవాడు

ఆ తరువాత —

భారతదేశం స్వతంత్రమైంది,

ఆంధ్ర దేశం అస్వతంత్రమైంది

అందువల్ల — కాలానుగుణంగా —

ఆంధ్ర దేశ పాలకులుగా — రాజులు పోయి మంత్రులు వచ్చారు, కొందరు రాజులే మంత్రులైనారు!

అలా మంత్రుల పరిపాలన సాగిపోతుండగా— నాలుగైదేళ్ల క్రితం —

ఒకానొక మంత్రిగారి సన్నిధికి ఒకానొక దిగంబర సన్యాసి వచ్చాడు

వచ్చి — ''అయ్యా! తమరి వల్ల నా కొక చిన్న సహాయం కావాలి'' అని అడిగాడు!

''ఏమిటది?'' అని సవినయంగా అడిగాడు మంత్రి! అందుకు సన్యాసి ''వూరి చివర శ్మశానంలో — ప్రజాక్షేమం కోసం ఒక హోమం చేస్తున్నాను అందుకు తమ సహాయం కావాలి'' అన్నాడు!

''ప్రజాక్షేమం కోసమైతే — నా ప్రాణాలయినా యిస్తాను! నేను పుట్టింది ప్రజాసేవ కోసమే గదా'' అన్నాడు మంత్రి!

''తమరు సరిగా అర్ధరాత్రివేళ — శ్మశానికి రావాలి'' అన్నాడు సన్యాసి

''ఎందుకు?'' అని అడిగారు మంత్రి

''ఏం? శ్మశానం అంటే భయమా?''

''అబ్బే! నాకేంభయం! మీరు అక్కడే వుంటారుగా?'' అన్నాడు మంత్రి

''వుంటాను'' అన్నాడు సన్యాసి!

''అయితే వస్తాను'' అన్నాడు మంత్రి

''అయితే బ్రతికినన్నాళ్లు మంత్రిగానే వుండేటట్లు ఒక మూలికగూడ యిస్తాన''న్నాడు సన్యాసి!

''అయితే తప్పక వస్తాన''ని — సరిగ్గా అర్ధరాత్రివేళకి శ్మశానానికి వెళ్లాడు మంత్రి!

అప్పటికే సన్యాసి అక్కడ హోమం చేస్తున్నాడు

''అదుగో! చూడండి!'' అని షుమారు మైలు దూరంలో వున్న మోదుగు చెట్టు చూపాడు సన్యాసి మంత్రికి!

మంత్రి చూశాడు!

''మోదుగు చెట్టు ఎక్కగలరా?'' అని అడిగాడు సన్యాసి!

''మోదుగుచెట్టు ఏం కర్మం! తాడిచెట్టు గూడ తల్లక్రిందులుగా ఎక్కగలను! నాకు చిన్నప్పుడు అలవాటే''నన్నాడు మంత్రి!

''అయితే తమరు ఆ మోదుగుచెట్టు ఎక్కి, చిటారు కొమ్మన తల్లక్రిందులుగా వేళ్లాడే భేతాళుణ్ణి పట్టి, కట్టి, మోసుకురావాలి'' అని చెప్పాడు సన్యాసి

''ఎందుకు?'' అని అడిగి—మళ్లీ వెంటనే—

''అన్నట్లు ప్రజా క్షేమం కోసం అని చెప్పారుగా! వెళ్లి తీసుకొస్తాను'' అని మంత్రి వెళ్లబోతుంటే—

సన్యాసి ''ఆగండి! ఆ భేతాళుణ్ణి మోసుకువచ్చేటప్పుడు— తమరు మౌనం పాటించాలి! నోరు విప్పి మాట్లాడగూడదు

మాట్లాడారా— భేతాళుడు తుర్రుమని ఎగిరిపోయి— మళ్లీ మోదుగు చెట్టుమీద వాలతాడు! జాగ్రత్త'' అని హెచ్చరించాడు సన్యాసి!

'అలాగే' అని మంత్రి, మోదుగు చెట్టు వద్దకు వెళ్లి— చెట్టు అవలీలగా ఎక్కి— భేతాళుణ్ణి పట్టి, కట్టి— బుజాన వేసుకుని— నడిచి వస్తున్నాడు—

భేతాళుడు ''అయ్యా! మంత్రివర్యా!'' అని పిలిచాడు మంత్రి మాట్లాడకుండా వచ్చేస్తున్నాడు

"స్త్రైలెంటుగా పోతూంటే— బోర్ కొడుతున్నది ఏవైనా కబుర్లు చెప్పకుంటూ పోదాం!" అన్నాడు భేతాళుడు

భేతాళుడు, తనను మౌనభంగం చేయాలని ప్లానువేస్తున్నాడని గ్రహించాడు మంత్రి!

మళ్లీ—భేతాళుడు—

"నేను కొన్ని ప్రశ్నలు వేస్తాను ఆ ప్రశ్నలకి జవాబు తెలియకపోతే— నోరుమూసుకుని వూరుకోండి నేనేమీ అనుకోను!

కాని— నా ప్రశ్నకి జవాబు తెలిసిగూడా చెప్పకపోతే — మీ శిరస్సు వెయ్యిన్నొక్కముక్కలవుతుంది! జాగ్రత్త" అని హెచ్చరించాడు భేతాళుడు

మంత్రి మాట్లాడలేదు! నడచిపోతున్నాడు!

భేతాళుడు ప్రారంభించాడు ప్రశ్నలు —

"కృష్ణా గోదావరి ఆనకట్టలు కట్టిన తెల్లదొర పేరేమిటి?"

మంత్రి మాట్లాడకుండా పోతున్నాడు మంత్రి తల పగిలిపోలేదు

భేతాళుడికి ఆశ్చర్యం వేసింది

"ఓహో! అంటే మంత్రికి జవాబు తెలీదన్నమాట" అనుకొని— ఈసారి యింకా తేలిక ప్రశ్న అడుగుదామని—

"రెండో ప్రపంచ యుద్ధం ఎవరెవరికి జరిగింది?" అని అడిగాడు

జవాబు లేదు! అయినా మంత్రి తల పగల్లేదు!

"ఇండియాకి స్వరాజ్యం ఎప్పుడొచ్చింది?" జవాబులేదు

"ఇందిరాగాంధి భర్త పేరేమిటి?"

"పోనీ రాజీవ్‌గాంధి తండ్రి పేరేమిటి?"

"మహాత్మాగాంధికి ఇందిరాగాంధి ఏమవుతుంది?"

"ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని జిల్లాలున్నాయ్?"

"గేదె కట్టిన తరువాత ఎన్నాళ్లకు యీనుతుంది?"

"గుడ్లు పిల్లలు కావడానికి కోడిపెట్ట ఎన్నాళ్లు పొదుగుతుంది?"

"గాడిద గుడ్లు పెడుతుందా? పిల్లల్ని పెడుతుందా?"

మంత్రి వెంటనే —

"గుడ్లు పెడుతుంది" అన్నాడు

వెంటనే భేతాళుడు తుర్రుమని ఎగిరిపోయి మోదుగుచెట్టుమీద వాలాడు

మంత్రి గుండె జారిపోయింది కాళ్లీడ్చుకుంటూ సన్యాసి వద్దకు నడిచి వెళ్లాడు

"పడిన శ్రమ అంతా వృధా అయింది స్వామీ" అన్నాడు

"ఏం? ఏం జరిగింద"ని అడిగాడు సన్యాసి ఆదుర్దాగా!

"భేతాళుడు నన్ను మాట్లాడించాలని ఎంతో ప్రయత్నించాడు!

ఎన్నో కఠినమైన ప్రశ్నలు వేశాడు నా అదృష్టంకొద్దీ వాటికి జవాబులు నాకు తెలియలేదు అందుకని హాయిగా—నోరు మూసుకుని — నడుస్తూ వస్తున్నాను ఆఖరికి—నా దురదృష్టం కొద్దీ — ఒక ప్రశ్న వేశాడు

"గాడిద గుడ్డు పెడుతుందా? పిల్లల్ని పెడుతుందా? అని అడిగాడు! గుడ్లు పెడుతుందని చెప్పేశాను"

సన్యాసి విసుగ్గా —

"అబ్బా! జవాబు తెలియనప్పుడు ఆ ప్రశ్నకిగూడ నోరు మూసుకుని వూరుకోకపోయావా?" అన్నాడు!

"తెలియకపోతే వూరుకోవచ్చు! కాని — జవాబు తెలిసి — చెప్పకపోతే — తల పగిలి ఛస్తానే!?" దీనంగా అన్నాడు మంత్రి!

సన్యాసి కోపం దిగమింగుతూ —

"అంటే — ఆ ప్రశ్నకి నీకు జవాబు తెలుసా?" అని తీవ్రంగా అడిగాడు!

"తెలియకేం స్వామీ! "గాడిదగుడ్డు"సంగతి తెలియని తెలుగువాడున్నాడా? ఆంధ్రదేశంలో గాడిదలేని వూరుందా? గుడ్డుపెట్టని గాడిద వుందా?" మందహాసంతో అన్నాడు మంత్రి!

"నా కర్మ!" అని నొసలు బాదుకున్నాడు సన్యాసి!

"మీ ఒక్కడి కర్మేగాదు! తెలుగువాళ్లందరి కర్మ" అని సవరించాడు మంత్రి! ●

## తొలి అడుగు

డా॥ సి. నారాయణరెడ్డి

ఈ ఓటమి తుది విజయానికి తొలి అడుగు
ఈ ఓరిమి నవక్రాంతికి తొలి తొడుగు
ఎటు తోచక తనలోతానే గొణుగుకునే
ఈ ఊపిరి రేపటి ఝంఝంకు తొలిమడుగు

ఆ మబ్బు సంతకం ఉన్నది చినుకుల్లో
ఈ మాను సంతకం ఉన్నది చిగురుల్లో
ఏ దస్తావేజులను చూసి ఏం లాభం?
నా మనసు సంతకం ఉన్నది కవితల్లో

ఒక కంటికి ఇష్టం ఒక కంటికి కష్టం
ఈ విషమదృష్టి ముదిరితె ఒంటికి నష్టం
ఎన్నాళ్ళు గోళ్ళు గిల్లుకుంటె యేముంది?
ఈ సమస్య చల్లారని రావణకాష్ఠం